# త మ్ము డు

ఏ కాం కి క

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

# TAMMUDU (తమ్ముడు)

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

దిజిలిటీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# కృతిసమర్పణము

## మిత్రశ్రీ

## డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

*అంకితమగుత చిరస్నే*
*హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై*
*సంకలనముగా నా యే*
*కాంకికలు నవభువనవిజయాధ్యతునకున్.*

*రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ*
*త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసరీవియందు ఏ*
*రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్ము, స్వర్ణ నీ*
*రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్ములో.*

*నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నంద నా*
*రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రఫుల్లమున్;*
*కోమలభావవీచికలకున్ గిలిగింతలు  పెట్టు ఈ పూరా*
*రామము నీదు  పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.*

# నివేదన

**I**

**"తమ్ముడు "** ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. ఉరికంబం, గీతకత్తి, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. గీతకత్తిలో రెండే పాత్రలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

**II**

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ యైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్టు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

**III**

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

## IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

## V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

**నండూరి రామకృష్ణమాచార్య**

# తమ్ముడు

**భూమికలు:**

1. పట్టాభిరామయ్య ... ప్లీడరు
2. విజయకుమార్ ... అతని తమ్ముడు, చిత్రకారుడు
3. సర్కిల్ ఇన్‌స్పెక్టర్
4. అనసూయ

# తమ్ముడు

పట్టాభిరామయ్య ఇల్లు. మేడ మిద గది. సోఫాలు, కుర్చీలు, బల్ల, లా స్తకాలబీరువా, గోడకు తగిలించిన చిత్రలేఖనాలు, తివాచీలు. నటరాజ విగ్రహం బల్లమీద ఉంటుంది. ఆ గదిలో కళాభినివేశం, సంపన్నత ఉట్టిపడుతూ ఉంటుంది. నిలువుటద్దం ఉన్న ఒక బీరువా ఉంటుంది.

పట్టాభిరామయ్య పడకకుర్చీలో కూర్చొని చదువుకుంటూ ఉంటాడు. మోటారు సైకిల్ చప్పుడు. హారను ధ్వని. సర్కిల్ ఇన్‌స్పెక్టరు ప్రవేశం.

**పట్టాభి:** హల్లో...సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారా! రండి, దయ చేయండి. ఇట్లా సోఫాలో కూర్చోండి, సుఖంగా ఉంటుంది.

**సర్కిల్:** కంగ్రాచులేషన్స్. చెప్పారు కాదేమండి, విజయకుమార్ మీ తమ్ముడా? బాగుందండి. మన ఆంధ్రుడొకడు లండను అంతర్జాతీయ చిత్రకళాప్రదర్శనలో ప్రథమబహుమతి కొట్టడంతో, ఎంత సంతోషమైనదండీ!

**పట్టాభి:** ఏదో పెద్దల ఆశీర్వచనం. ఇదివరకుకూడ మా వాడి చిత్రలేఖనాలు ఢిల్లీ, బాంబాయి, మాస్కో, పెకింగు, టోక్యో చిత్రకళాప్రదర్శనలలో ప్రదర్శింపబడ్డాయి. టోక్యోలో మావాడి నటరాజును మూడేండ్ల క్రితం ప్రత్యేక బహుమతి ఇచ్చారు. ఇదిగో చూడండి.

**సర్కిల్:** ఆహాహ్! ఎంత బాగుందండి ఈ బొమ్మ. ఇదివరకు మీ ఇంట్లో చూచానుగానండీ, ఈ బొమ్మలో ఇంత విలువ వుందని నాకు తెలియదండీ. నాకేకాదండీ, లండను బహుమానమొచ్చే వరకూ ఈ ఊళ్లో ఎవరికీ మీవాడి గొప్పదనం తెలియదనుకోండి.

**పట్టాభి:** ఈ ఊళ్లో ఏమిటండి, విదేశీయులు మెచ్చుకున్న తర్వాతగాని మన ఆంధ్రులు మనవాడి నెవరినీ మెచ్చుకోవటం చేతకాదు.

**సర్కిల్:** అరే! మా S.P. చెప్పేవరకూ అసలు ఆ విజయకుమార్ మీ తమ్ముడని నాకే తెలియదండీ. మరచిపోయాను, మీ చెల్లెలు

మొన్న University first గా ప్యాసు అయిందని, భారత ప్రభుత్వంవారి స్కాలరుషిప్పుతో అమెరికా వెడుతోందని కలెక్టరుగారు చెప్పారు. ఎంత అదృష్టమండీ, మీ కుటుంబం అంతా ప్రజాలపుట్ట. బాగుంది. మీ తమ్ముడు ప్రపంచప్రఖ్యాతి నొందిన చిత్రకారుడు, మీరు ఆంధ్రదేశమంతా పేరుమోగిన లాయరుమాత్రమేగాక అసమాన నటులు.

**పట్టాభి:** మా దేముందండీ! మా నాన్నగారు శతావధాని, గాయకుడు, శిల్పి, పండితుడు, నటుడు. ఏదో ఇంగువగుడ్డ వాసన లివి. అంతే. మొట్టమొదట మా నాన్నగారు వ్రాసిన కృష్ణలీలలలో నేను మొదటి కృష్ణుడుగా స్టేజి ఎక్కాను.

**సర్కిల్:** అల్లా చెప్పండి...మీ నాన్నగారు మహాకవులు! మీరు గొప్ప నటు లయ్యారు. మా S.P. గారు అన్నారే... మీరు కోర్టులో కేసువాదిస్తూఉన్నా, స్టేజిమీద నటిస్తున్నట్లుగానే ఉంటుందని.

**పట్టాభి:** దానికేం...ఈ నాటకాల్లోపడి ఫైలంతా పాడు చేసుకుంటున్నానని మిత్రులంతా వేళాకోళం. ఇదుగో, ఈసారి క్లబ్బు నాటకం అయిపోయినతర్వాత చచ్చినా స్టేజి ఎక్కనని ఒట్టుపెట్టుకున్నా.

**సర్కిల్:** అదేమిటండీ! మీవంటి కళారాధకులు అట్లా అంటే ఇంకేముంది.

**పట్టాభి:** సరేగానీ, ఏది...మీరు దేవదేవి వేషానికి ఎవరినో తీసుక వస్తారన్నారు. ఇక పట్టుమని పదిరోజులు లేవుగదా! మీ కారుహారను వినిపిస్తే దేవదేవిని తీసుకవచ్చారేమో అని అనుకున్నాను.

**సర్కిల్:** అందుకనే వచ్చాను. సరిగ్గా ఎనిమిది గంటలకు ఇక్కడికే వస్తానందండి.

**పట్టాభి:** నాటకాల వాళ్ల మాట నమ్మారా పోలీసువారుకూడా! దగ్గరుండి తీసుక రావద్దండీ!

**సర్కిల్:** నిజమే, తీసుక రావటం...కారంతా ఖాళీగానే ఉందిగా...కాని ఊరు ఊరంతా గబ్బెత్తిపోతుందని ఆమెనే రమ్మన్నాను.

**పట్టాభి:** ఎవరా అమ్మాయి! పేరేమిటి?

**సర్కిల్:** అనసూయటా. స్త్రీసమాజంలో నాట్యం, సంగీతం నేర్పే మిస్ట్రెసండీ.

**పట్టాభి:** అయితే మీకట్లా తెలుసు!

**సర్కిల్:** అబ్బే నాకేం తెలియదే! మా అమ్మాయి అక్కడ భరతనాట్యం నేర్చుకుంటోంది. అదీ పరిచయం.

**పట్టాభి:** అయితే బాగా పాడుతుందా? విగ్రహం ఎట్లా ఉంటుంది? దేవదేవికి పనికివస్తుందా?

**సర్కిల్:** ఇదివరకూ మూడుసార్లు దేవదేవి వేసిందట. తెనాలి ఆంధ్రనాటక కళాపరిషత్తులో ఉత్తమనటిగా బహుమతి పొందింది. చూస్తారుగా, కిన్నెరకంఠం. ఏదైనా మీచేతి కింద తయారైతే వేరే చెప్పాలా!

**పట్టాభి:** ఎవరండీ యీ అనసూయ? ఏమిటో అనసూయ, అరుంధతి అని ఆ మహాపతివ్రతల పేరులన్నీ ఇల్లా ఖరాబు చెయ్యటం.

**సర్కిల్:** అసలుపేరు వేరే ఉందిలెండి. మీతో ఎందుకా గొడవ అని ఊరుకున్నా. ఆ చలపతిగాడున్నాడే...

**పట్టాభి:** ఆఁ. ఆ దత్తుడు, మా ఊరేలెండి. తండ్రి సంపాదించిన ఆస్తి మస్తుగా ఉంది. వాడు ఎంతమందిని పాడుచేశాడనుకుంటున్నారు?

**సర్కిల్:** చెడతాగి రోడ్డుమీద పడిపోతూ ఉంటాడు. వాడికీ ఈ అమ్మాయికీ ఏదో సంబంధం పూర్వాశ్రమంలో ఉందిట.

**పట్టాభి**: అదంతా మనకెందుకులెండి. మన నాటకంలో వేమం వేస్తుందా, వెయ్యదా! అంతే. ఈ ఆడవేషాలు కుదరక చస్తున్నామనుకోండి. అందుకనే ఆడవేమంలేని నాటకం వ్రాయవయ్యా అని మా కవిగారితో మొరపెట్టుకుంటున్నాం.

**సర్కిల్**: ఏం బాగుంటుందండీ ఒక్క ఆడవేమమైనా లేనినాటకం. వట్టిపోతు పేరంటాంలాగ తయారవుతుంది. అబ్బే, ఆడవేషం లేకపోతే ఇంక రంగేముంటుంది?

**పట్టాభి**: అందుకనేగా ఆడవేమంకోసం ఇన్నితంటాలు పడుతుంది.

**సర్కిల్**: ఏమోనండీ, మీ రెట్లా వేసినా సరే, S.P. గారు, కలెక్టరుగారు మంచి ఉషారుగా ఉన్నారు. ఇప్పటికే రు.300 ల టిక్కెట్లు అమ్మేశారు. ఆరోజు మంత్రిగారు కూడా వస్తారని అనుకుంటున్నారు.

**పట్టాభి**: అవును లెండి. ఇల్లాంటి ఉద్ధరి నాటకాలు వేయించుకోవాలంటే మేం కావాలి. ఏ పబ్లిక్ ప్రాసిక్యూటరో ఖాళీ వస్తేమాత్రం ఎవరి బంధువులు వారికే ఉంటారు. అంతేగదా!

**సర్కిల్**: ఏమండోయ్, మరిచిపోయాను, ఈసారి పబ్లిక్ ప్రాసిక్యూటరు జాబితాలో మీపేరుకూడా వినిపిస్తోంది.

**పట్టాభి**: మనకెందుకు ఇస్తారయ్యా?

**సర్కిల్**: అదేమిటండీ! ఈ ఊళ్లో ఎంతమంది ప్లీడర్లకు మీకున్న అనుభవం, చాకచక్యం, సమర్థత ఉందదండీ! చెప్పండి.

**పట్టాభి**: పబ్లిక్ ప్రాసిక్యూటరు పదవి అనుభవం, సమర్థత, చాకచక్యం చూచి ఇస్తారా? అదీగాక నాజీవితం కళోపాసనకే అంకితం చేశాను. నా కస్తేమటుకు పుచ్చుకుంటానా ఈ వెధవ పబ్లికు ప్రాసిక్యూటరు ఉద్యోగం! ఈమధ్య పెనుగొండ ఒక కేసుకు వెడితే మునసబుగారు నన్ను చూచి ఈరాత్రి ఏం నాటకం ఉందండి అన్నాడు. నవ్వుతున్నాను. నాటకాలంటే మనపేరు జ్ఞాపకం వచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటరంటే ఎందుకు వస్తుందదండీ. అయినా ఇదివరకూ ఉన్నాడుగా, అతనికే మళ్ళా తిరిగి ఇస్తారనుకుంటున్నారు.

**సర్కిల్**: ఆ! ఉట్టి అసమర్థుడు. పట్టపగలు నడివీధిలో జరిగిన హత్య (కూనవరం కూనీ కేసు) కొట్టేశారండీ. అబ్బే, అన్ని కేసులు తగలేశారండీ. లేకపోతే నా కీపాటికే ప్రమోషన్ రాకపోయేదా!

**పట్టాభి**: వీడిసంగతి నాకు మొదటినుండి తెలుసు, పబ్లిక్ ప్రాసిక్యూటరు కాకపూర్వం పైలు సున్నా.

**సర్కిల్**: వెనుకటి ప్రభుత్వంలో ఏదో తెచ్చుకున్నాడు. ఈసారి లాభం లేదులెండి.

**పట్టాభి**: ఎప్పుడైనా నా సమర్థుడికి రాదు. అంతే.

**సర్కిల్**: అంతేనండి అక్షరాలా! నా ఇరవైఏళ్ల అనుభవములో సమర్థుడికి రావటం ఒక్కసారి చూడలేదండీ. అసలు ఈ ముండమోపి ఉద్యోగం మీ కెందుకు లెద్దురూ !

తెరలో

అమ్మా మా దాకబళం తల్లీ

ధర్మహస్తము దాగదన్నా

కర్మభూమిని కడుపుమంటలు

ఆర్పివేసే అన్నపూర్ణా

హస్తమేదమ్మా

అమ్మా మా దాక బళం తల్లీ.

**సర్కిల్**: ఈ ముష్టి వైధవ్యాల్ని షూట్ చేసి పారవెయ్యాలండి. వెధవలు, ఇంగ్లండులో అడుక్కుంటే అరెష్టు చేస్తారట. సగం సరాలన్నీ వీళ్ళ మూలనేనండి....పోరా...పో...పొమ్మంటూంటే...నీకు కాదూ చెప్పేది.

తెరలో పాట

**పట్టాభి**: బాడల్లా పోడులెండి. తినమరిగిన ప్రాణం ఆలమరిగిందని మా ఆడిడ రోజూ వీడికింత ముద్ధపారేస్తుంది. ఈ వేళ దేవదేవి వస్తుందని మా శ్రీమతిని, పిల్లల్ని సినిమాకు పంపించాను. ఇక వీడు మనప్రాణం తీశాడన్న మాటే. ఇదిగో ఈ రెండణాలు పారెయ్యేండి. వాడే పోతాడు.

**సర్కిల్**: ఉండండి పట్టాభిరామయ్యగారూ! నే నిస్తాగా. ఒరే వెధవా, ఇదిగో ఈ రెండణాలు తీసుకో పో.

తెరలో పాట అంతరిస్తుంది

**పట్టాభి**: ఇంకా రాలేదేమండీ దేవదేవి?

**సర్కిల్**: అదే నాకూ అర్థంకావటం లేదు. నేవెళ్లి తీసుకరానా!

తెరలో పోస్ట్ - టెలిగ్రామ్ సార్

పట్టాభి లేచివెళ్ళి అందుకుని చించి చదువుతూ వస్తాడు.

**సర్కిల్**: ఏం. విశేషాలేమి లేవుకదా!

**పట్టాభి**: చూడండి.

**సర్కిల్**: పబ్లిక్ ప్రాసిక్యూటరుగా మిమ్మల్నే వేశారు. నేం చెప్పలేదండీ, సమర్థులు మీకు రాకపోతే ఇంకెవ్వరికి వస్తుందండీ. భేష్.

**పట్టాభి**: నేను కలలోగూడా అనుకోలేదు సుమండీ, అయినా ఈమధ్య మనప్రభుత్వంవారు సమర్థతకూడా చూస్తున్నారులెండి.

**సర్కిల్**: సమర్థత ఎప్పటికైనా పైకిరాక తప్పదనుకోండి. వస్తుంది, వచ్చి తీరుతుంది. బాగుందండి. ఇదుగో ఆలస్యం చెయ్యకుండా వెంటనే అంగీకరించినట్లు టెలిగ్రాం ఇచ్చేద్దాం .

**పట్టాభి**: నా కళో పాసనకు అడ్డం వస్తుందేమోనని...

**సర్కిల్**: అడ్డంరాదు, గిడ్డంరాదు. కానివ్వండి. జోడు గుళ్ల బారులాగా ఇటు లా, అటు కళా రెండూ ఏకటాకీని సాగవలసిందే. ఇదిగో ఏదీ, అంగీకరించాను అని వ్రాసెయ్యండి. వెళ్ళి టెలిగ్రాం ఇచ్చేస్తాను.

**పట్టాభి**: నా కిష్టం లేదుగాని, మీలాంటిమిత్రులు చెపుతున్నారు కాబట్టి పోస్టాఫీసులో ఇచ్చెయ్యండి. దారిలో దేవదేవిని దగ్గరుండి తీసుకరావాలి.

**సర్కిల్**: సరే! దేవదేవిని ప్రొద్దున తీసుకరాకూడదా! పడుకుంటారేమో మీరు?

**పట్టాభి**: అబ్బే, రాత్రి 12 గం. వరకు పోర్షన్ వల్లె వేయాలి, చదువుతూంటాను. తీసుకరండి. ఇంకా మొదటిపో ఆయినా వదలిపెట్టం దే !

**సర్కిల్**: అయితే వెళ్ళి తీసుకవస్తాను.

**పట్టాభి**: మీకోసం ఎదురు చూస్తూంటాను.

పట్టాభి చదువుకుంటూ కూర్చుంటాడు - రేడియో పెట్టుకొని.

అనసూయ ప్రవేశం

**పట్టాభి**: ఎవరండీ!

**అన**: నమస్కారం.

**పట్టాభి**: ఓహో! 'అనసూయ' మీరేనా!

**అన**: అవును.

**పట్టాభి**: రావమ్మా రా. ఇట్లా కూర్చో. సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు ఇంతవరకు నీకోసం, చూచి చూచి ఇప్పుడే వెళ్లారు. నీవు ఎనిమిది గంటలకే వస్తావన్నారు.

**అన**: అవును. నేను ఎనిమిది గంటలకే వచ్చాను.

**పట్టాభి**: అయితే ఎక్కడ ఉన్నట్లు! ఆయన ఉండగానే రాలేదే!

**అన**: ఆయన ఉన్నారనే రాలేదు.

**పట్టాభి**: వింతగా ఉన్నదే! సరే. నీ ప్రసన్నవిగ్రహం, నీ నునుసోగకన్నులు, కోమల భ్రూలతావిక్షేపాలు, తీర్చిదిద్దినట్లున్న సర్వాంగసౌష్టవం, అచ్చుగ్రుద్దినట్లు ఆ దేవదేవి దిగివచ్చిందని అనిపిస్తుంది. ప్రేక్షకుల కనుగొల్కులలో కమ్మని కలలకు రెక్కలు పొదగాలి. తెలిసిందా. నువ్వు ఇదివరకు దేవదేవి రెండు సారులు వేశావుగా.

**అన**: ఇక వేయలేనేమోనండీ!

**పట్టాభి**: అదేమిటమ్మా, నాతో వేయటం నీ కిష్టం లేదన్నమాట.

**అన**: ఎంతమాట, క్షమించాలి. అసలు ఏమను కుంటే ఏమిలాభం. నా జీవితంలో ఇల్లాంటి విషమఘట్టం, నాకు నోరు రావటం లేదు మీకేమని చెప్పాలో.

**పట్టాభి**: అవునమ్మా, విన్నాను. నీకు జరిగిన అన్యాయం, నీ విషయమంతా సర్కిలుగారు చెప్పారులే.

**అన**: సర్కిలుగారికి నా విషయం ఏమీ తెలియదండీ!

**పట్టాభి**: సరే. లోకంలో అందరూ దత్తుడు ఆ చలపతి లాంటివాళ్లే అనుకోకమ్మా, నిన్ను అర్థంచేసుకొని సానుభూతి చూపించగల సుకుమారహృదయులు ఈ భూగోళంలో లేరనుకోకు.

**అన**: లేకనేం. ఒక సుకుమారహృదయుడు, ఒక కోమలమనస్కుడు, కళోపాసకుడు, ప్రేమతపస్వి, పతితపావనుడు, ఈ శరణార్థికి...సంఘంలోగాని కన్నతల్లిదండ్రుల హృదయంలోగాని జానెడు చోటులోని ఈ దీనురాలికే స్థానం కల్పించాడు.

**పట్టాభి**: ఆ యువకుడు నిజంగా ధన్యజీవి.

**అన**: అతని హృదయం ఒక పవిత్ర దేవాలయం. నేను అక్కడ ఒక దేవదాసిని.

**పట్టాభి**: అనసూయా! నీ అమాయికత్వం చూస్తే నాకు జాలివేస్తోంది. నవ్యలావణ్యలహరివైన నీ యౌవన సౌందర్య విలాస విభ్రమాలు ఏ యువకణ్ణి ఆకర్షింపవు! కాని నిన్ను బహిరంగంగా వివాహం చేసుకొనే ధైర్యం అతనికుంటే, అతనికి నా హృదయం పులకాంకుర ప్రకారాలతో కర్పూర నీరాజనం సమర్పిస్తుంది.

**అన**: చలపతికి భార్యగా ఉండటంకంటే ఆ కళాపరంజ్యోతికి ఉంపుడుకత్తెగానైనా ఉండటమే మంచిది. కాని, ఏం చెయ్యను? ఏం చెప్పను?

**పట్టాభి**: అవును. చలపతి చెడత్రాగేసి, ఆరోగ్యం చెడగొట్టుకున్నాడు. ఇప్ప డెక్కడున్నాడు? ఈ ఊళ్లోనే ఉన్నాడా?

**అన**: ఈ ఊళ్లోనా? ఈ ప్రపంచంలోనే లేడు.

**పట్టాభి**: ఆ! చలపతి చచ్చిపోయాడా? ఎప్పుడు?

**అన**: కొన్నిగంటలయింది. సాయంకాలం మా ఇంటికి వచ్చాడు. చెడత్రాగి, నన్ను కొట్టి, తిట్టి, నానాహంగామా చేస్తున్నాడు. ఇంతలో...

**పట్టాభి**: ఇంతలో

**అన**: ఇంతలో మధురహృదయుడు, కళామూర్తి...

**పట్టాభి**: ఆ యువకుడు వచ్చాడా!

**అన**: అవును. రాగానే చలపతి అతనిమీదకు ఉరికి కలియబడ్డాడు. అతడొక్క త్రోపుతో కాడో లేడో క్రిం దబడి...

**పట్టాభి**: క్రిందబడి

**అన**: ఏమున్నది ఇంక లేవలేదు.

**పట్టాభి**: అంటే నీవూ ఆ యువకుడూ కలిసి చలపతిని హత్య చేశారన్నమాట.

**అన**: కాదు చలపతి చచ్చిపోయాడు.

**పట్టాభి**: నిజం చెప్పు.

**అన**: క్షమించండి. ఇది కోర్టుకాదు, అబద్ధం ఆడటం ఎందుకు?

**పట్టాభి**: అయితే, నీవు ఎవరితో మాట్లాడుతున్నావో నీకు తెలుసా?

**అన**: తెలుసు. మీరుతప్ప ఎవడు రక్షిస్తారు! కరుణిస్తారని గంపెడాశతో వచ్చాను. మీరు కరుణార్ద్ర హృదయులు, కళోపాసకులు.

**పట్టాభి**: హంతకుల్ని కరుణించటం నాచేతగాదు. నీవు పొరపాటు పడుతున్నావు. నా ముందే ఈ మాటలు చెప్పటానికి నీకు ధైర్యం ఎట్లావచ్చిందా అని ఆలోచిస్తున్నాను.

**అన**: అతడు హంతకుడు కాడు, మీరు కరుణించక తప్పదు. మీ కాళ్లు పట్టుకుంటున్నాను. అతనికి మీరుతప్ప దిక్కెవ్వరూ లేరు. అవసరమైతే నన్నురితీయించండి, సంతోషంగా అతనికోసం నా ప్రాణాలు ఇస్తాను.

**పట్టాభి**: ఇద్దరికీ ఉరి తప్పదు, నేను చేయగలిగిందిమీ లేదు.

**అన**: అల్లా అనకండి. రక్షించండి.

విజయకుమార్ ప్రవేశం

**పట్టాభి**: ఏమిటిరా, ఎక్కడి కెళ్ళావు? ఇంత అర్ధరాత్రి రావటం ఏమిటి! ఇప్పటికి జ్ఞాపకం వచ్చిందన్నమాట ఇల్లు, ఇల్లువదలి ఎన్నిరోజులైందిరా!

**విజయ**: నాల్గు రో జులైం దనుకుంటాను.

**పట్టాభి**: తిండికికూడా ఇంటికి రాలేదే! ఏమిటిరా ఇది? నిజం చెప్పు, ఎక్కడున్నావు! ఏం చేస్తున్నావు!

**విజయ**: నిజం చెప్పే ధైర్యం లేదు, అబద్ధం చెప్పటం ఇష్టం లేదు.

**పట్టాభి**: బాగుంది, బాగుంది. నీకు లండను బహుమతి వచ్చిన సంగతైనా తెలుసా?

**విజయ**: అవును, విజయకుమార్ అని మరెవరో వచ్చిందన్నారు.

**పట్టాభి**: ఓహో హో, నీ పేరుకూడా మర్చిపోయావన్న మాట.

**విజయ**: కాదన్నయ్యా! విజయకుమార్ అంటే ఇంకెవరో అనుకున్నాను. నేను పంపించని చిత్రాలకు బహుమతి ఎట్లా వస్తుంది?

**పట్టాభి**: ఉన్నానుకాదురా, పెద్దనాన్నదని. నేనే పంపించాను. నీ చిత్రాలన్నీ ఎక్కడున్నాయో నీకేమైనా తెలుసునా?

**విజయ**: తెలియదు.

**పట్టాభి**: మొన్ననగా 'కేబిల్' వచ్చింది లండనునుంచి. నీవు ఐపూ అంతూలేదాయె, ఏ మనుకోవాలి. అందరూ వచ్చి ఏడండి మీతమ్ముడంటూంటే. ఏమిటిరా, నక్కి నక్కి గోడకు జారగిల పడుతున్నావు, ఏదో హత్యచేసి వచ్చిన వాడిలాగా?

**విజయ**: నిజం చెప్పమన్నారు అన్నయ్యా, హత్యచేసే వచ్చాను.

**పట్టాభి**: ఏముంది, ఇంకిదొకటి తక్కువైంది. ఉత్తరీయం వేసుకోవటం ఎప్పటినుండి మొదలుపెట్టావు?

**విజయ**: ఈ ఉత్తరీయం నాదికాదు. చచ్చిపోయిన చలపతిది.

**పట్టాభి:** ఆఁ! హత్య చేశావట్రా!

**విజయ:** అవును అన్నయ్యా!

**అన:** రక్షించాలి. విజయకుమార్‌కు మీరుగాక దిక్కెవ్వరు? తండ్రి పోయినదగ్గరనుంచీ కన్నబిడ్డకంటే మక్కువగా చూచారని ఎన్నో సార్లు చెప్పాడు.

**పట్టాభి:** అవును. మరణశయ్యమీద మా నాన్నగారు అప్పగించి పోయారు. ఎంతగతి పట్టింది! అనసూయా! చలపతి శవం మీ ఇంట్లోనే ఉన్నదా?

**అన:** లేదు. మీ తమ్ముడు బుజంమీద వేసుకొని వెళ్లిపోయారు. నేను మీతో చెప్పాలని వచ్చేశాను.

**పట్టాభి:** ఏరా! హత్య చెయ్యటంకాకుండా శవాన్ని నడివీధిలో వీపుమీద మోసుకొని పోయావట్రా? ఏమిటిరా నీ ధైర్యం. ఏం చేశావురా! పోలీసుస్టేషనుకి తీసుకొని పోయి అప్ప చెప్పివచ్చావా?

**విజయ:** ఆ! ధైర్యం లేకపోయిందన్నయ్యా! రైలువంతెన కింద పెట్టి వచ్చేశాను.

**పట్టాభి:** ఎవరూ చూడలేదా!

**విజయ:** లేదు. నక్కల తోటలోనుంచి చుట్టుదారిన వెళ్లాను. చినుకులు పడుతున్నాయి, ఎవ్వరూ లేరు. పాపం, చాలాచలిగా ఉంది. ఈ ఉత్తరీయం అయినా పైనకప్పి రాలేదు.

**పట్టాభి:** ఆహా! ఎంతదయ!

**విజయ:** నిజం అన్నయ్యా! నేను చంపాలని చంపలేదు. ఒక్క లెంపకాయ తిని గిర్రున నేలమీదపడి లేవలేదు.

**పట్టాభి:** అవునులే. చెడత్రాగి త్రాగి, గుండె ఆగి చచ్చిపోయి ఉంటాడు. అయితేమటుకు, సరేగాని. అనసూయా! చలపతి నీ ఇంటికి రావటం ఈ వేళ ఎవరైనా చూచారా? కొట్టటం, తిట్టటం...

**అన:** ఎవరూ చూడలేదు. ఎవరికీ తెలియదు.

**పట్టాభి:** అయితే సర్కిలు ఇన్‌స్పెక్టరుకూ నీకూ ఎట్లాంటి పరిచయం?

**అన:** వారి అమ్మాయికి భరతనాట్యం చెపుతున్నాను. అంతే.

**పట్టాభి:** నిన్ను అనుమానించడుగదా!

**అన:** అనుమానించడు.

**పట్టాభి:** సర్కిలు ఇప్పుడు నీ ఇంటికే వెళ్ళిఉంటాడు. కలుసుకుంటే ఏం చెపుతావు?

**అన:** మీరేం చెప్పమంటే అదే చెప్పుతాను.

**పట్టాభి:** అనసూయా! యథార్థ జీవితనాటకం కంటే ఏ బూటక నాటకం గొప్పదికాదు. నీ విప్పు డెటువంటి అద్భుతపాత్ర అభినయించావో అర్థంచేసుకో, నీవు విజయకుమారుని అసలు చూడనేలేదు. తెలిసిందా?

**అన:** తెలిసింది.

**పట్టాభి:** నిన్ను నమ్మవచ్చునా!

**అన:** నా ప్రాణం ధారపోస్తాను. విజయకుమారుని రక్షించండి. అంతేచాలు.

**పట్టాభి:** హత్య బయటపడితే ఇద్దరికీ ఉరిశిక్ష తప్పదు. ఇదిగో ఒరేయ్, ముందర ఆ ఉత్తరీయం తగలబెట్టి మసి నూతిలో కలిపెయ్యి. ఇదిగో అనసూయా, నీవు వెళ్ళిపోవటం మంచిది. ఆగు. అదిగో కారను చప్పుడు. లోపలి కెళ్ళండి. సర్కిలు వస్తున్నాడు.

అనసూయ, విజయులు లోపలికి వెళతారు

సర్కిలు ప్రవేశం

**పట్టాభి:** రండి సర్కిలుగారూ! కూర్చోండి. దేవదేవి ఇంటికి వెళ్ళారా?

**సర్కిల్:** లేదండి. అట్లా వెడదామనుకునేటప్పటికి, ఒక కూనీ కేసు. చూచారా, ఇందాక వచ్చాడు, ముష్టి వైధవ - వాడు ఆ చలపతిని హత్య చేశాడండీ.

**పట్టాభి:** ఆఁ! హత్య చెయ్యటమే! అంత చప్పున ఎట్లాగా పట్టుకున్నారండీ?

**సర్కిల్:** ఏమందీ, మావాళ్ళు, ఆ బిచ్చగాణ్ణి పట్టుకునేసరికి వాడిదగ్గిర ప్రజాల ఉంగరాలు, బంగారపు రిస్టువాచి గొలుసు, రు. 3000-00 ల నగదు ఉన్న పర్సు, అందులో చలపతి అడసుకార్డు ఉన్నవిట. మొదట చోరీకేసు అనుకున్నారు.

**పట్టాభి:** దొంగతనమే అయి ఉంటుందండీ!

**సర్కిల్:** అబ్బే, మావాళ్ళు వస్తూఉంటే రైల్వేబ్రిడ్జి క్రిం ద చలపతి శవం దొరికిందట.

**పట్టాభి:** ఒహెూ బాగా పట్టారే.

**సర్కిల్:** ఏమందండి, ఆ డబ్బుకోసం, వాడే చంపిఉండాలి.

**పట్టాభి:** అనుమానం ఏమంది?

**సర్కిల్:** కాని వాడిదగ్గర అడక్కతినే జోలితప్ప ఏమీ లేవే! ఎట్లా చంపాడ అని. నే నేమీ ఎరగను, శవం ఉంటే ఉంగరాలూ, అవి తీసుకున్నానంటున్నాడు.

**పట్టాభి:** అయితే కావచ్చు. చలపతి చెడత్రాగే రకం. గుండె ఆగిపోయి ఉండవచ్చు.

**సర్కిల్:** ఇక మనకు లాభం ఏమంది? అది కూనీ కేసేలెండి, బ్రిడ్జిదగ్గర అడుగుజాడలు ఉన్నాయి.

**పట్టాభి:** ఆఁ! అడుగుజాడలా.

**సర్కిల్:** వర్షం కురిసింది కాదండీ! రోడ్డుమీద కనిపించడం లేదు! పైగా అవి చెప్పులకాళ్ళు. ముష్టివాడే కాక ఎవరో దగ్గిరకు వచ్చి భయపడి పోయినట్లు అనుమానంగా ఉంది.

**పట్టాభి:** మీకే అనుమానాలు వస్తే, ఇంక ఈ కేసుకూడా పోయినట్టే లెండి.

**సర్కిల్:** అబ్బే, ముష్టివాడి కాళ్ల జాడలుకూడా ఉన్నాయి. అదిగాక ఉంగరాలు, రిస్టువాచి, సొమ్ము అన్నీ కనుపించటం లేదండీ!

పట్టాభి: అంతే లెండి.

**సర్కిల్:** క్షమించాలండి, ఈ గందరగోళంలో నేను అనసూయదగ్గరకు వెళ్ళలేకపోయాను. కాని మా కానిస్టేబులును పంపించాను.

**పట్టాభి:** అల్లాగా! ఏమన్నది?

**సర్కిల్:** ఆమె ఇంట్లో లేదట. ప్రక్క ఇంటివాళ్ళ నడిగితే తెలియదన్నారుట. అదిగాక ఆ ఇల్లు ఒక మూల ఉంది లెండి. ప్రక్కన 100 గజాల్లో ఇల్లేలేదు. ఏ సినిమాకో పోయి ఉంటుంది.

**పట్టాభి:** ఈ వేళ కృష్ణతులాభారం కొత్తది వచ్చింది కాదండీ! వెళ్ళే ఉంటుంది. మావాళ్లుకూడా వెళ్ళారుగా!

**సర్కిల్:** సినిమా వదిలే వేళయింది. ఇంకోసారి అనసూయ ఇంటికి వెళ్ళి, ఉంటే తీసుకొని వస్తాను.

**పట్టాభి:** ప్రయత్నించి చూడండి.

**సర్కిల్:** సెలవు.

ప్రవేశం - విజయకుమార్

**విజయ:** ఆగండి ఒక నిముషం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గారూ!

**పట్టాభి:** తమ్ముడా, ఏమిటిరా నీ ఆగడం!

**సర్కిల్:** ఓ విజయకుమార్ గారూ! విశ్వవిఖ్యాతి నార్జించిన ఆంధ్రయువకునకు నా హృదయపూర్వకమైన అభినందనలు. (కరచాలనం చేస్తూ).

**పట్టాభి:** తమ్ముడా, తమ్ముడా!

**విజయ:** అన్నయ్యా, తమించు. సర్కిల్‌గారూ! చలపతిని హత్యచేసింది ఆ బిచ్చగాడు కాదు, నేనే. ఇదిగో మీకు వ్రాసి ఇస్తున్నాను.

**సర్కిల్:** ఆఁ! చలపతి మీకక్కడ తారసిల్లినట్లు?

**విజయ:** అనసూయ ఇంట్లో, తప్ప త్రాగివచ్చి ఆమెపై చేయి చేసుకోబోతుంటే అడ్డువెళ్ళి ఒక్క త్రోపు త్రోశాను. అంతే. కిందబడి లేవలేదు.

**పట్టాభి:** తమ్ముడా, తమ్ముడా, ఎంతపని చేశావురా!

**విజయ:** అన్నయ్యా, క్షమించు. నేను చేసిన నేరానికి ఒక నిర్దోషి బలికావటం నాకు ఇష్టంలేదు. ఆ బిచ్చగాడు గూడా మనవంటి మనిషే. వాడికీ ప్రాణంమీద తీపేఉంది. గడగడవణికే చలిలో మసిపాతలు కట్టుకొని ఇల్లిల్లూ నడపీనుగులా తిరగటం గుటగుటలాడే ప్రాణాలు ఎట్లాగైనా నిలుపుకోవాలనే.

**పట్టాభి:** తమ్ముడా, ఆత్మహత్య చేసుకొని స్వర్గలోకంలోకి పోయినా నాన్నగారి మొగం చూడలేను. బదికియున్నా, లోకుల మొగం చూడలేను.

**విజయ:** క్షమించు అన్నయ్యా! హంతకుడు నీ తమ్ముడని లోకులు అనుకునే అపచారం చేశాను. చలపతిని హత్య చేసినందుకు చట్టం నాకు ఉరిశిక్ష విధించినా, అన్నయ్యా, భగవంతుడు నన్ను కరుణిస్తాడు. బిచ్చగాడికి ఉరిశిక్ష పడితే, నన్ను ఆ భగవంతుడుగూడా క్షమించడు.

**పట్టాభి:** తమ్ముడా, తమ్ముడా (కౌగిలించుకొని ఏడుస్తాడు)

**విజయ:** అన్నయ్యా! నేను హత్యచేసింది చలపతినిగాదు అన్నయ్యా, నిన్నే హత్యచేశాను. మన కుటుంబగౌరవాన్ని హత్యచేయగలిగాను. కాని, ఆ బిచ్చగాడిని హత్య చేయలేకపోయాను. సర్కిల్ గారూ, వ్రాతపూర్వకంగా నేను చేసిన నేరం అంగీకరించానుగద. మా వదినగారితో ఈ సంగతిచెప్పి, ఆమె పాదాలకు నా తుది నమస్కారంచేసి, వస్తాను. మీ ఇష్టంవచ్చినప్పుడు నన్ను అరెస్టు చేయవచ్చు.

నిష్క్రమణము

**సర్కిల్:** విజయకుమార్! విజయకుమార్! అరే, వెళ్ళి పోయాడే. పట్టాభిగారూ! మీరు అధైర్యపడకండి, అయితే అనసూయ యేమైనట్లు?

అనసూయ ప్రవేశం

**అన:** సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారికి నమస్కారం.

**సర్కిల్:** ఇక్కడే ఉన్నావా అనసూయా! భయపడకు.

**అన:** సర్కిల్‌గారూ! ఇదిగో వ్రాతమూలకంగా ఇస్తున్నాను. చలపతిని హత్య చేసింది పాపం ఏమీ ఎరగని అమాయికుడు విజయకుమార్ కాదు, నేనే. నన్ను అరెస్టు చేయండి. విజయకుమార్ నిర్దోషి.

**సర్కిల్**: విజయకుమార్ నిర్దోషి మాత్రమేకాడు. ఆర్ద్రహృదయుడు, మహాచిత్రకారుడు, మహాత్ముడు, నిజమైన ధీరోదాత్త నాయకుడు.

**పట్టాభి:** అనసూయా! నీ వెంత సాహసానికి ఒడిగట్టావు? నీ సహవాసం పట్టినందుకు నా తమ్ముణ్ణి నిందించాను. నీ-వీ మాటమీదే నిలుస్తే...

**అనసూయ:** వ్రాతమూలకంగా ఇచ్చినా నన్ను శంకిస్తున్నారా? అవును. నేను లోకం దృష్టిలో కులటను.

**సర్కిల్:** కాదు అనసూయా! నీవు నా దృష్టిలో పూర్వకాలంలో భర్తతో సహగమనం చేసిన మహాపతివ్రతల కోవకు చెందినదానవు. నీవు నా చేతికిచ్చిన కాగితం నిన్ను ఉరితీయించగలదు.

**అనసూయ:** సంతోషంతో చచ్చిపోతాను. విజయకుమార్ బతికితే చాలు.

**సర్కిల్:** పట్టాభిగారూ! మన తొలికేసు చేతులారా పోగొట్టుకుంటున్నాం. ఈ కాగితాలు తగలపెట్టేస్తున్నాను.

**అనసూయ:** ఆ బిచ్చగాడికి శిక్షపడితే విజయకుమార్ ఆత్మహత్య చేసుకుంటాడు.

**సర్కిల్:** వాణ్ణి ఒదిలిపెట్టేసి, ఆ మాడువేలరూపాయలు పంచుకోవాలని మావాళ్లు ఇదివరకే ప్రతిపాదించారు. నా అడ్డం లేకపోతే ఈ వరకే...

**పట్టాభి:** పాపం, జేతాలుచాలని వాళ్ళేం చేస్తారు ?

**సర్కిల్:** పట్టాభిగారూ, సెలవు.

నిష్క్రమణ

**తెర**